సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 14 । నవంబర్ । 2023



ఆనంద దీపావళి

దీపావళి పండగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. 8లో



పోస్టర్ ఆవిష్కరణ

రాష్ట్ర ఐటీ వింగ్ నిర్వహించనున్న జగనన్న ప్రగతి పథం కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. 8లో



భక్తిశ్రద్ధలతో నృసింహ హోమం

సింహాచలం: సింహాచలేశుని జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

థాంక్యూ సీఎం సార్

- జీతాలు పెంచినందుకు సెర్ప్ సిబ్బంది హర్షం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సెర్ప్ సిబ్బంది, డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చెయ్యడం పట్ల స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ ఆసోసియేషన్ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు తారువలో డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు సమక్షంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జి.ఎం ధర్మేంద్ర, కోశాధికారి రమణ, వివిధ జిల్లాల సీనియర్ ఏజీఎంలు పాల్గొన్నారు.

చెడ్డీ గ్యాంగ్‌తో పారాహుషార్

ఎస్.రాయవరం: రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో చెడ్డి గ్యాంగ్ దొంగలు తిరుగుతున్నారని, అనుమానితులు ఎవరైనా కంటపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ ప్రసాదరావు సోమవారం కోరారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం చెడ్డీ గ్యాంగ్ కదలికలపై పోలీసులు నిఘా ఉంచారని తెలిపారు. వీరు తాళాలు వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి ఎక్కువగా దొంగతనాలకు పాల్పడుతుంటారని చెప్పారు. రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలో నిద్రపోతుండగా ఎవరైనా తలుపులు కొడితే సమాచారం తెలుసుకుని తెరవాలన్నారు. అనుమానితుల సమాచారం ఉంటే 100కి , స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐ నంబర్ 9440796107కు ఫోన్ చేసి చెప్పాలన్నారు.

నేడు గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నామని వీఎండీఏ అధ్యక్ష్య, కార్యదర్శులు ఎం.ఎస్.రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు తెలిపారు. పురస్కారంతోపాటు, నాలుగు రోజు లపాటు నిర్వహించే ఆకాశదీపం- కాశీఖండం ప్రవచన కార్యక్రమాలకు సంబంధించి వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మంగళవారం డాక్టర్ గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నారని తెలిపారు. అనంతరం బుధవారం నుంచి 17వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి ఆకాశదీపం- కాశీఖండం ప్రవచనాలను డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచించనున్నారని పేర్కొన్నారు.

చిన్నారులు.. సిరి మువ్వలు



శకుంతల వేషంలో..



నాగలి పట్టిన రైతన్న



విద్యార్థినీ విద్యార్థుల జానపద నృత్యం



బ్రిటిష్ వారిపై విల్లు ఎక్కు పెట్టిన అల్లూరి

మెరుపు మెరిస్తే.. వాన కురిస్తే.. ఆకసమున హరివిల్లు విరిస్తే.. మన కోసమే అని సంబరపడే చిన్నారులు ఏది చేసినా ముదిపెంగా ఉంటుంది. వారి ఆటపాటలు ముచ్చట గొలుపుతాయి. అందరినీ ఆకట్టుకుంటాయి. వారు విచిత్ర వేషధారణలతో అలరిస్తుంటే చూసేందుకు రెండు కళ్లూ చాలవు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పీఆర్‌టీయూ నిర్వహిస్తున్న బాలల ప్రతిభాపాటవ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా సాగాయి. జానపద నృత్యాలు, విచిత్ర వేషధారణలతో బాలలు ప్రతిభ చాటుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి వంద మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రైతు, వ్యోమగామి, అల్లూరి సీతారామరాజు, దుర్యోధనుడు, ఝాన్సీ లక్ష్మీబాయి, శకుంతల వేషాలు ధరించి విద్యార్థులు అలరించారు. జానపద నృత్య పోటీల్లో 50 బృందాలు పాల్గొన్నాయి. విజేతలకు మంగళవారం జరగనున్న బాలల దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ తెలిపారు.

\- నర్సీపట్నం

జిల్లా ఆస్పత్రికి కార్పొరేట్ హంగులు

- అందుబాటులో ఉచితంగా ఖరీదైన వైద్యం
- అత్యాధునిక ల్యాబ్స్, స్పెషలిస్ట్ వైద్యులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి మహర్దశ
- రూ.30.35 కోట్లతో అభివృద్ధి పనులు, వైద్య పరికరాలు
- రూ.1.80 కోట్లతో నూతన సీటీ స్కాన్ మెషీన్
- ఇప్పటికే రూ.కోటితో ఆధునిక ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏర్పాటు



ఎన్టీఆర్ ఆస్పత్రి



కొత్తగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పరికరాలు

సాక్షి, అనకాపల్లి : అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి మహర్దశ వచ్చింది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఉచితంగా ఖరీదైన వైద్యం అందుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీఎస్సార్ నిధుల నుంచి రూ.30.35 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధి, వైద్య పరికరాలు, మౌలిక వసతుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సివిల్ పనులు, విద్యుత్ పనులను ఏపీఎంఎస్ఐడీసీ వారు చేపడుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు మించి పేద వాడికి ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రారంభం కూడా జరిగింది.

అదేవిధంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి వినూత్న పథకాలతో పేదోడి చెంతకే వైద్యసేవలందిస్తోంది.

- ఏపీఎంఐడీసీ నుంచి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో రూ.1.40 కోట్ల వరకూ సివిల్, విద్యుత్ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఈ పనులు ప్రారంభమయ్యాయి.
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో సీఎస్సార్ నిధుల్లో భాగంగా ఆదాని గ్రూప్ వారు రూ.1.80 కోట్లతో సీటీ స్కాన్ మెషీన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా ఈ మెషీన్ ఏర్పాటుకు ప్రత్యేక రూం ఏర్పాటు చేస్తున్నారు. పాత సీటీ స్కాన్ రూంలో సివిల్ పనులను ఏపీఎంఐడీసీ వారు ఇప్పటికే చేస్తున్నారు.
- ఏషియన్ పెయింట్స్ వారు సీఎస్సార్ ఫండ్స్‌లో భాగంగా రూ.15 లక్షలతో వైద్య పరికరాలు కూడా అందజేశారు.
- లారెస్ కంపెనీ వారు సీఎస్సార్ నిధుల్లో భాగంగా రూ.4కోట్లతో బర్న్ వార్డు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాన్ అప్రూవల్ కూడా వచ్చింది.
- ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి చొరవతో రూ.22 కోట్లతో కేంద్రం సీసీబీ (క్రిటికల్ కేర్ బ్లాక్) నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే సాయిల్ టెస్ట్‌కు వెళ్లింది. నివేదిక కూడా సిద్ధమైంది.
- ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా కేంద్రం అందించే నిధులతో రూ.కోటి రూపాయలతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ సదుపాయాన్ని అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

రోజూ వెయ్యి మందికి ఓపీ

- అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో రోజువారీగా సగటున 1000 నుంచి 1100 వరకూ ఓపీలు, 250-300 వరకూ ఐపీ (ఇన్‌పేషెంట్) రోగులు వస్తుంటారు. వీటితో పాటుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రిఫరల్ రోగులకు హ్యాండ్ కోల్డింగ్ పద్ధతిన అడ్మిషన్ జరుగుతోంది.

అందుబాటులో 280 పడకలు

- ఆస్పత్రిలో మొత్తం 36 మంది వైద్య నిపుణులకుగానూ..వీరిలో 30 మంది వరకూ వైద్యనిపుణులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నారు.



ఓపీ చీటి కోసం బారులు తీరిన రోగులు



ఐసీయూలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మరింత మెరుగైన వైద్యం



అనకాపల్లిలో ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో పేదోడికి మెరుగైన వైద్యసేవలందించేలా కృషి చేస్తున్నాం. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర వైద్యశాఖల నుంచి నిధులు మంజూరయ్యాయి. కొన్ని పనులు జరుగుతున్నాయి. మరికొన్ని త్వరలో ప్రారంభం కానున్నాయి. ఎక్కువగా అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి ఇక్కడకు రోగులు రావడం..వారికి తగిన వైద్యసేవలందించడం జరుగుతోంది. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల నుంచి కూడా ఇక్కడకు రిఫర్ చేస్తున్నారు. వారికి కూడా ప్రత్యేకమైన వైద్యసేవలందిస్తున్నాం. ఇటీవల బదిలీలు, పదోన్నతులపై పీడియాట్రిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, గైనిక్‌లో ముగ్గురు వైద్యుల స్థానాలు ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిని కూడా త్వరలో నియమించడం జరుగుతుంది.

\- డాక్టర్ శ్రీనివాస్, డీసీహెచ్ఎస్, అనకాపల్లి జిల్లా

వెంకన్న సన్నిధిలో ఎస్పీ మురళీకృష్ణ



ఎస్పీ మురళీకృష్ణకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అర్చకుడు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయాన్ని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆయన బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను, క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయన పేరున గోత్ర నామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు..

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈమధ్యకాలంలో జరిగిన వివిధ రకాల నేరాలపై ఆరా తీశారు. తీసుకున్న చర్యల గురించి తెలుసుకున్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించామన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. రాంగ్ రూట్లో రాకపోకలు సాగించే వాహనాలపై కేసులు నమోదు చేయాలని పోలీసులు, హైవే పెట్రోల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన ఆటోలపై కూడా కేసులు రాయాలన్నారు. ఆయన వెంట సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు ఉన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. ఈ నెల 19న విశాఖపట్నం- రాయగడ (08504) పాసింజర్ స్పెషల్, ఈ నెల 20న రాయగడ-విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్, ఈ నెల 20న విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (08546 / 08545) పాసింజర్ స్పెషల్ రైళ్లు ఇరువైపులా, ఈ నెల 20న విశాఖపట్నం- కోరాపుట్ (18512) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 21న కోరాపుట్ -విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

ఈ నెల 16న హౌరాలో 8.30 గంటలకు బయల్దేరాల్సిన హౌరా- సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఉదయం 11.05 గంటలకు బయల్దేరుతుంది. ఈ నెల 15వ తేదీన బెంగళూరులో ఉదయం 10.35గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.35గంటలకు బయల్దేరుతుంది.

- ఈ నెల 18వ తేదీన యశ్వంత్‌పూర్-పూరీ (22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ వయా గుత్తి ఫోర్ట్, యర్రగుంట్ల, మీదుగా ప్రయాణిస్తుంది.

రాత్రి విమానాలకు బ్రేక్

- రేపటి నుంచి మార్చి 31 వరకు విశాఖ ఎయిర్‌పోర్టులో రీ-సర్ఫేసింగ్ పనులు
- రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు రన్‌వే మూసివేత
- అందుకనుగుణంగా విమానాల వేళల్లో మార్పులు
- కేవలం మూడు విమాన సర్వీసులే రద్దు
- విమానయాన సంస్థల వింటర్ షెడ్యూల్ ఖరారు



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం అర్ధరాత్రి నుంచి నాలుగున్నర నెలలు రాత్రి వేళ విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి. ఆ సమయంలో 11 గంటల పాటు విమానాల రాకపోకలు రద్దు కానున్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నావికాదళం ఆధీనంలో ఉంది. నేవీ యుద్ధ విమానాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఐఎన్ఎస్ డేగా నియంత్రణలోని రన్‌వే నుంచే కార్యకలాపాలు సాగిస్తుంటాయి. పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లు కూడా ఈ రన్‌వే మీదుగానే జరుగుతుంటాయి. రక్షణశాఖ పదేళ్లకోసారి తమ రన్‌వేలకు రీ-సర్ఫేసింగ్ పనులు చేపడుతుంది. ఈ ప్రక్రియలో రన్‌వేపై మూడు పొరలను తొలగించి మళ్లీ కొత్తగా వేస్తారు. ఇంకా అవసరమైన ఇతర పనులు చేపడతారు.

ఇంతకుముందు ఐఎన్ఎస్ డేగాలో 2009లో రీ-సర్ఫేసింగ్ నిర్వహించారు. 2019లో మరోసారి నిర్వహించాల్సి ఉన్నా వివిధ కారణాలతో ఇప్పటివరకు జరగలేదు. ఈ ఏడాది రీ-సర్ఫేసింగ్‌ను నవంబరు 15 నుంచి మార్చి నెలాఖరు వరకు చేపట్టాలని రక్షణ శాఖ నిర్ణయించింది. ఈ పనులను రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు చేస్తారు. అందువల్ల ఆ సమయంలో ఈ రన్‌వేను మూసివేస్తారు. దీంతో ఈ 11 గంటల్లో ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను నిలిపివేస్తారు. ప్రస్తుతం ఈ విమానాశ్రయం నుంచి రోజూ 30 వరకు టేకాఫ్‌లు, 30 ల్యాండింగులు జరుగుతున్నాయి. రీ-సర్ఫేసింగ్‌తో 12 విమాన సర్వీసులు రద్దవుతాయని తొలుత భావించినా సర్దుబాట్లు అనంతరం మూడు (ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు) విమాన సర్వీసులే రద్దయ్యాయి

సమయాన్ని తగ్గించాలని కోరినా..



ఎయిర్‌పోర్టులో నైట్ ల్యాండింగ్ (ఫైల్)

విశాఖ ఎయిర్‌పోర్టులో రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు రన్‌వే మూసివేత సమయాన్ని తగ్గించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు తదితరులు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కార్యదర్శి గిరిధర్‌లతో పాటు తూర్పు నావికాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్‌కు విజ్ఞప్తి చేశారు. కానీ రక్షణ రంగ కార్యకలాపాలు, ప్రయాణికుల భద్రత, సౌలభ్యం దృష్ట్యా అది సాధ్యం కాదని ఈఎన్‌సీ చీఫ్ స్పష్టం చేశారు. అయితే పగటి పూట మరిన్ని విమానాలు నడవడానికి టైం స్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందుకోసం ఏటీసీలో మరింత మంది సిబ్బందిని పెంచడానికి సిద్ధమని చెప్పారు. దేశంలోని ఇతర విమానాశ్రయాల్లో కంటే విశాఖ ఎయిర్‌పోర్టు రీ-సర్ఫేసింగ్‌కు ఎక్కువ సమయం తీసుకోవడానికి సమాంతర ట్యాక్సీ ట్రాక్ లేకపోవడమేనని రక్షణశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా రీ-సర్ఫేసింగ్‌కు అవసరమైన కసరత్తు పూర్తయిందని, ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

షెడ్యూల్ వేళల మార్పు

రీ-సర్ఫేసింగ్ నేపథ్యంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే విమానాల వేళలను సర్దుబాటు చేసుకోవాలని సంబంధిత విమానయాన సంస్థలకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇదివరకే సమాచారం అందించింది. దీంతో ఆయా సంస్థలు తమ విమానాల వేళల మార్పుతో పాటు వింటర్ షెడ్యూలు ఖరారు చేసుకున్నాయి. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ఒక్కటే నడుస్తోంది. ఈ విమానం రోజూ రాత్రి 10 గంటలకు విశాఖ వచ్చి 11 గంటలకు బయలుదేరుతుంది. నవంబరు 15 తర్వాత నుంచి ఈ విమానం మూడు గంటలు ముందుగా రాత్రి ఏడు గంటలకే వచ్చి ఎనిమిది గంటలకు వెళ్తుంది. దీంతో పాటు చెన్నై, ఢిల్లీ, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, కడప, కోల్‌కతా, గోవా, జైపూర్, పోర్టుబ్లెయిర్, పూణే నుంచి వచ్చి, వెళ్లే దేశీయ విమాన సర్వీసులు కూడా తమ షెడ్యూల్ సమయాన్ని అరగంట నుంచి మూడు గంటల వరకు సర్దుబాటు చేసుకున్నాయి.

పర్యాటక సీజన్ వేళ

ఏటా పర్యాటక సీజన్ ఆరంభమయ్యే అక్టోబర్ నుంచి విశాఖకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. నాలుగైదు నెలల పాటు విమానాలకు పర్యాటకుల తాకిడి కొనసాగుతుంది. సాధారణంగా వింటర్ సీజన్‌లో పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ షెడ్యూళ్లను పెంచుతుంటాయి. కానీ ఈ ఏడాది వింటర్ పీక్ సీజన్‌లోనే రీ-సర్ఫేసింగ్ పనులు మొదలవుతుండడంతో ఎక్కువ విమాన సర్వీసులు రద్దవుతాయని పర్యాటకులు ఆందోళన చెందారు. కానీ మూడు విమాన సర్వీసులే రద్దు కావడంతో ఒకింత ఊరట కలగనుంది.

మళ్లీ జగనే సీఎం కావాలని..



ఉగ్గినపాలెం వద్ద ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును అభినందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- తిరుపతికి ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్ర
- జిల్లాలో పార్టీ శ్రేణుల సాదర స్వాగతం



రఘురాజుతో పాదయాత్రలో పాల్గొన్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ /కొత్తకోట : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. సంక్షేమ సారథికి ప్రజల ఆశీస్సులతోపాటు వెంకన్న దీవెనలు అందాలని ఆకాంక్షిస్తూ ఆయన ఎస్.కోట మండలం బొడ్డవర నుంచి తిరుమల తిరుపతికి 'జయహో జగనన్న...జగనే రావాలి..' అంటూ పాదయాత్ర చేపట్టారు. సోమవారం యాత్రకు అనకాపల్లి మండలం రేబాకలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఆయనను రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు పాదయాత్రగా గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, ఎంపీటీసీలు మంత్రి సత్తిబాబు, బంటు ఏడుకొండలు, అర్జునరావు, సర్పంచ్‌లు గోవింద, శ్రీను, రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు కోన కిశోర్, ఇంటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్ సత్కారం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎమ్మెల్సీ రఘురాజును ఘనంగా సన్మానించారు. పాదయాత్రగా వచ్చి ఉగ్గినపాలెం వద్ద మధ్యాహ్నం విడిది చేసిన ఎమ్మెల్సీ రఘురాజును మంత్రి అమర్‌నాథ్ కలిసి అభినందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దైవ బలం ఉండాలని ఆశిస్తూ రఘురాజు చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిషోర్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, సర్పంచ్ దేవుళ్లు పాల్గొన్నారు.

820 కిలోమీటర్లు.. 43 రోజులు..

ప్రజా సంక్షేమానికి అంకితమైన జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రాష్ట్రానికి సీఎం కావాలన్న సంకల్పంతో తిరుపతికి పాదయాత్ర చేపట్టానని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ఉగ్గినపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్.కోట మండలం బొడ్డవరం గ్రామం నుంచి ఈ నెల 8న పాదయాత్ర ప్రారంభించానని, 820 కిలోమీటర్ల దూరాన్ని 43 రోజుల్లో పూర్తి చేసి, వచ్చే నెల 21న తిరుమల చేరుకోవాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నానన్నారు.

క్లుప్తంగా

తైక్వాండో జాతీయ పోటీలకు చరణ్‌తేజ



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చరణ్‌తేజతో కోచ్ చందు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు చందు తైక్వాండో క్లబ్ క్రీడాకారుడు పి.చరణ్‌తేజ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ చందు సోమవారం మీడియాకు తెలిపారు. పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన చరణ్‌తేజ ఈ నెల 8, 9 తేదీల్లో కడపలోని రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో 73 కేజీల విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వచ్చే నెలలో నిర్వహించే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. చరణ్‌ను తైక్వాండో ఏపీ న్యూ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి తదితరులు అభినందించారు.

ఏలేరు కాలువలో పడి పాడిరైతు మృతి



కరక రాము నాయుడు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం వద్ద ఏలేరు కాలువలో సోమవారం ప్రమాదవశాత్తు మునిగి పాడి రైతు మృతి చెందారు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కరక రామునాయుడు(57) శనివారం పాడి పశువులను మేతకు తీసుకెళ్లి ఎప్పటిలాగే సమీపంలోని ఏలేరు కాలువలో శుభ్ర పరుస్తుండగా కాళ్లు జారి కాలువ ప్రవాహంలో కొట్టుకుపోయారు.

స్థానికులు గమనించి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు కాలువలో వెతికినప్పటి ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏలేరు కాలువలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం కశింకోట సమీపంలో రామునాయుడు మృతదేహం లభ్యమైంది. దాన్ని వెలికి తీసి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరమ పవిత్రం.. కార్తీక మాసం

- నేటి నుంచి మాసోత్సవాలు ప్రారంభం
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

రాంబిల్లి: పవిత్ర కార్తీక మాసం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతూ భగవంతుని వైపు భక్తులను నడిపిస్తుంది. ఈ మాసంలో దేవాలయాలన్నీ కిటకిటలాడతాయి. శివ కేశవులకు విశేష పూజలు, అభిషేకాలు చేస్తారు. కార్తీక మాసోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానుండడంతో జిల్లాలోని ఆలయాలను అందంగా అలంకరించారు. ప్రతిరోజు సాయంత్రం అర్చకులు ధ్వజస్తంభంపై ఆకాశదీపం వెలిగిస్తారు. పౌర్ణమినాడు జ్వాలాతోరణం వెలిగించడం పుణ్యదాయకమని విశ్వసిస్తారు. కార్తీక పూజలకు ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రీ.శ. 11, 13 శతాబ్దాల్లో ఇక్కడి ఆలయాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఇక్కడ నిత్యం ప్రవహించే ఐదు ధారలు ఉంటాయి. అందుకే ఈ ప్రాంతాన్ని ధారపాలెం అంటారు. ఈ ఐదు ధారల్లో పవిత్రమైన ప్రధానమైన ధార ఆకాశ ధార. ఈ ధారతో పుణ్యస్నానం ఆచరించి క్షేత్రపాలకుడు ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే సకలశుభాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంకా ఈ పుణ్యక్షేత్రంలో కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, రాధా మాధవస్వామి ఆలయం, సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంతోపాటు ద్విముఖ కల్యాణ వినాయకస్వామి ఆలయాలు ఉన్నాయి. విశాలమైన ప్రదేశం ఉండడం, ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉండటంతో ఇక్కడ పిక్నిక్‌లకు కూడా పలు ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు.



పవిత్రమైన ఆకాశధార



పంచదార్ల పుణ్యక్షేత్రంలో ధర్మలింగేశ్వరస్వామి

ఆనందోత్సాహాల మధ్య దీపావళి సంబరాలు



కుటుంబ సభ్యులతో కలిసి దివ్వెలు కొడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



దీపావళి వేడుకలు చేసుకుంటున్న ఎంపీ సత్యవతి కుటుంబ సభ్యులు

- వేడుకల్లో పాల్గొన్న విప్, ఎంపీ కుటుంబీకులు

చోడవరం: దీపావళి పండగను ప్రజలంతా ఎంతో సందడిగా ఆనందోత్సాహాల మధ్య ఆదివారం రాత్రి నిర్వహించారు. రంగురంగుల దీపాలు వెలిగించి దివ్వెలు కొట్టారు. జీవితంలో చీకట్లు తొలగిపోయి వెలుగులు నిండాలని లక్ష్మీదేవికి పూజలు చేశారు. చోడవరం పట్టణంలో బాణసంచా దుకాణాలన్నీ అమ్మకాలతో కిటకిటలాడాయి. బాణసంచాలు పేల్చి చిన్నాపెద్దా అంతా సందడి చేశారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన స్వగ్రామం కేజేపురంలో దీపావళి పండగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. దివ్వెలు కొట్టి బాణసంచా కాల్చారు. చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి, గౌరీశ్వరస్వామి, దుర్గమ్మ ఆలయాల్లో దీపాలు వెలిగించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

అనకాపల్లి టౌన్: ఎంపీ బీవీ సత్యవతి తన స్వగృహంలో ఆదివారం రాత్రి దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేసి, దివ్వెలు వెలిగించారు. ఈ వేడుకల్లో ఎంపీ భర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, కుమారుడు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మాడుగుల: మండలంలోని గాదిరాయి గ్రామానికి చెందిన యువకుడు పి.నాగేశ్వరరావు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గుర్తించి, అతనిని వెంటనే మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య సేవలందించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వైద్యాధికారి రామకుమార్ తెలిపారు.

తంతడి బీచ్‌లో విద్యార్థి మృతి


- దీపావళి రోజున అప్పన్నపాలెంలో విషాదం

అచ్యుతాపురం(అనకాపల్లి): అందరికీ వెలుగుల్ని పంచే దీపావళి ఆ కుటుంబానికి మాత్రం చీకట్లను మిగిల్చింది. బాగా చదువుకుని తమ బతుకుల్ని బాగుచేస్తాడనుకున్న పెద్ద కుమారుడు అలల రక్కసికి బలవడంతో వారి బాధ వర్ణనాతీతంగా మారింది. అచ్యుతాపురం మండలంలోని అప్పన్నపాలేనికి చెందిన రెడ్డి లోకేష్(19) మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎంతో చురుగ్గా ఉండే లోకేష్ డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి నూకరాజు ఆటో డ్రైవర్‌గా, తల్లి అచ్యుతాపురంలో పాన్‌షాప్ నిర్వహిస్తూ ఇద్దరు కుమారుల్ని చదివిస్తున్నారు. వీరిలో పెద్ద కుమారుడైన లోకేష్‌తో పాటు అతని తమ్ముడు, మరో 8 మంది స్నేహితులు ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరయ్యారు. అనంతరం తంతడి బీచ్‌కు వెళ్లారు. వీరు స్నానం చేస్తుండగా లోకేష్, అతని సోదరుడ్ని కెరటాలు లాక్కెళ్లాయి. అక్కడే ఉన్న కొందరు స్థానికులు వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. లోకేష్ సోదరుడు క్షేమంగానే బయటపడ్డాడు. లోకేష్ మాత్రం కెరటాల తాకిడికి నీరు కడుపులోకి వెళ్లడంతో ఆస్పత్రికి తరలించే లోపే మరణించాడు. ఈ సంఘటన కుటుంబ సభ్యులతోపాటు, అప్పన్నపాలెం వాసులకు తీరని శోకాన్ని మిగిల్చింది.

శారదానదిలో గుర్తు తెలియని మృతదేహం

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ శారదానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు ఎస్ఐ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు. ఉమ్మలాడ శారదానదిలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వీఆర్వో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ ఆలీకి ఫోన్‌లో సమాచారం అందించారు. ఎస్ఐ ఆలీ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, శరీరంపై పసుపు రంగు ఫుల్‌షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించామని, వివరాల కోసం మునగపాక పోలీసు స్టేషన్‌ను సంప్రదించాల్సిందిగా ఎస్ఐ ఆలీ కోరారు.

రేపు స్థాయీ సంఘ సమావేశం



దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నారు. స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల స్థాయీ సంఘ సమావేశంలో నిర్వహించనున్న సమావేశానికి 23 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

- బీచ్‌రోడ్డులో ఆర్కే బీచ్ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న విగ్రహాలు, విగ్రహ పీఠాలకు ఫోకస్ లైట్లు ఏర్పాటు
- జీవీఎంసీ 92వ వార్డు అజంతా పార్క్ ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో కల్యాణ మండపం నిర్మాణం
- జోన్-7 పరిధి 82వ వార్డులో ఎన్టీఆర్ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ జిమ్ నిర్మాణానికి పరిపాలనా పరమైన ఆమోదానికి, టెండర్లు పిలిచేందుకు..
- వేపగుంటలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి 30 కేఎల్‌డీ శుద్ధి చేయబడిన నీటిని సరఫరాకు గాను పైపులైన్ వేసేందుకు..
- బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ మూడేళ్ల కాలానికి మెయింటెనెన్స్ చేసేందుకు పిలిచిన రిక్వెస్ట్ ఫర్ పర్సనల్ ఆర్థిక ప్రతిపాదన
- గాజువాక జోన్ 73వ వార్డు సింహగిరి కాలనీ వద్ద సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల ఏర్పాటు
- అనకాపల్లి జోన్ ప్రధాన రహదారి ఎన్టీఆర్ విగ్రహం వద్ద జంక్షన్ విస్తరణ.
- గాజువాక జోన్ 64 నుంచి 79 వార్డులు, 85 నుంచి 88 వార్డుల్లో రాత్రి వేళల్లో ప్రధాన రహదారుల పారిశుధ్య నిర్వహణకు మూడు నెలల కాలానికి అదనపు సిబ్బంది నియామకం.
- 47వ వార్డు కప్పరాడలో సెయింట్ మదర్ థెరిస్సా విగ్రహానికి మరమ్మతులు చేపట్టేందుకు..
- జోన్-2 పరిధి 12, 13 వార్డుల్లో సూర్య తేజ నగర్ బ్రిడ్జి నుంచి శ్రీకాంత్ నగర్ కల్వర్టు వరకు ఎంఎస్ చైన్ లింక్ మెష్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు
- బీచ్‌రోడ్డు 8వ వార్డు సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులో గల కాళీమాత గుడికి ఆనుకొని ఉన్న స్థలం అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టేందుకు తదితర అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

'జగనన్న ప్రగతి పథం' పోస్టర్ ఆవిష్కరణ

కొమ్మాది: రాష్ట్ర ఐటీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జగనన్న ప్రగతి పథం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకట్రావు, రవిరెడ్డి, ఐటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మధు సంపత్, రవికాంత్, గిరిధర్, రాష్ట్ర కార్యదర్శి జగదీష్, జిల్లా ఐటీ అధ్యక్షుడు బొండా ఉమ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు



రామన్నపాలెం గిరిజన కుటుంబాలతో డిప్యూటీ సీఎం బూడి

- పూలగరువు, రామన్నపాలెం నుంచి 16 సీపీఎం కుటుంబాల చేరిక
- సాదరంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: సీపీఎం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. మండలంలో వాలాబు పంచాయతీ పూలగరువు, రామన్నపాలెం శివారు గ్రామాల్లో సీపీఎంకు చెందిన 16 కుటుంబాలు ఆ పార్టీకి వీడ్కోలు పలికి, వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వైఎస్సార్‌సీపీలో చేరేందుకు తారువ క్యాంపు కార్యాలయానికి సోమవారం స్వచ్ఛందంగా వచ్చిన వారికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. రెండు రోజుల క్రితం కోడాపల్లికి చెందిన 17 కుటుంబాలు సీపీఎం నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం తెలిసిందే. అదేబాటలో మిగిలిన రెండు గ్రామాలైన పూలగరువు నుంచి 11 కుటుంబాలు, రామన్నపాలెం నుంచి 5 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో కళ్లముందు చూపించిన వ్యక్తి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక తమ జీవితంలో చూడనంత అభివృద్ధిని తమ మండలంలో చూస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు సీపీఎం నాయకుల మాయలోపడి, వారికి మద్దతుగా ఉన్నామని, వారి ఉనికి కోసం అమాయక గిరిజనుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. పూలగరువుకు చెందిన దుప్పు దాసు, ఐరటా ఈశ్వరావు, కాదల దేవా, కాదల తాతబాబు, నాయుడు, సోమల గంగమ్మ, దేముడమ్మ, సాయికుమార్, జమ్ములమ్మ మహాలక్ష్మి, రామన్నపాలేనికి చెందిన తామర్ల శంకరరావు, చిన్నారావు, భీమన్నదొర, చదల భీమరాజు, సన్యాసిరావు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా చూశాక తమకున్న అపోహలు తొలగిపోయాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, వాలాబు నాయకుడు పోడెల నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం



మజ్జి బాబూరావు(ఫైల్)

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే యార్డు పక్కనున్న రైలు పట్టాలపై సోమవారం వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితమే చనిపోయి ఉండవచ్చని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

మృతుడి వద్ద బ్యాగులో లభించిన ఆధార్ కార్డు వివరాల మేరకు కశింకోట మండలం, నర్సింగబిల్లికి చెందిన మజ్జి బాబూరావు(40)గా గుర్తించారు. ప్రమాదవశాత్తూ ప్లాట్‌ఫాం పైనుంచి జారి పడి, పట్టాలపై ఉన్న రాళ్లు తలకు తగిలి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే యార్డు పక్కనున్న ఈ ప్లాట్‌ఫాం పూర్తిగా పొదల మధ్య ఉండటంతో దుర్వాసన వస్తేగానీ మృతదేహం ఉన్నట్లు తెలియలేదు. మృతుని వద్ద రెండు మొబైల్ ఫోన్లు కూడా ఉన్నాయి. మోకాళ్లపై చిన్న గాయాలున్నాయి. మృతుని కుటుంబీకులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ మారూఫ్ తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వాస్పత్రిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు.



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్

రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు వరాహపురం విద్యార్థులు

మాడుగుల రూరల్: రాష్ట్ర స్థాయి కత్తిసాము పోటీలకు చీడికాడ మండలం, వరాహపురం హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి కత్తిసాము పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు బద్ది లలిత, విస్సారపు కృష్ణవేణి, పడాల ఉర్మిళ, పి.రూపేష్, పడాల హర్షవర్ధన్, సిరసపల్లి గౌతమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సింహాచలం సోమవారం తెలిపారు. ఈ విద్యార్థులు ఈ నెల 15, 16, 17, తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం దొడ్డి వరాహమూర్తి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ధర్మిశెట్టి స్వాతి, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్ములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబుతో పాటు ధర్మిశెట్టి కొండబాబు, స్కూలు కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.



కత్తిసాము పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ

పుస్తకం విలువ చాటేలా..!

- నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
- ఈ నెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

దాబాగార్డెన్స్/విశాఖ విద్య: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావు తెలిపారు. సోమవారం గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో వారోత్సవాల ప్రచార పోస్టర్లు, బ్యానర్స్, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వివరాలను వెల్లడించారు. విశాఖ నగరంలోని సూర్యబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వేదికగా వారోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు

వారోత్సవాల షెడ్యూల్ ఇదీ...

- ఈ నెల 14న బాలల దినోత్సవం రోజు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తారు.
- 15న పుస్తక ప్రదర్శనతోపాటు మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన కార్యక్రమం, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై సెమినార్ నిర్వహించనున్నారు.
- 16న ఉదయం 10 గంటలకు గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం, గ్రంథాలయ ఉద్యమ నాయకులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథం, అయ్యంకి వెంకటమరణయ్య, పాతూరి నాగభూషణం తదితరులకు నివాళులర్పించుట, గ్రంథపాలకుల సదస్సు నిర్వహించనున్నారు. అనంతరం లైబ్రేరియన్ ఎస్ఎల్ రాజేంద్రవర్మ నిర్వహణలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 'విజ్ఞానం పెంపొందించడంలో గ్రంథాలయాల పాత్ర'పై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు.
- 17న సాయంత్రం గరిమ సాంస్కృతిక వేదిక సారథ్యంలో కవి సమ్మేళనం.
- 18న గ్రంథాలయ సభ్యత్వ దరావతు స్వీకరణ. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఆటలు, దేశభక్తి గేయాల పోటీలు.
- 19న ఉదయం 10 గంటలకు గరిమ సాంస్కృతిక వేదిక సారథ్యంలో మహిళా దినోత్సవం నిర్వహణ. దిశ చట్టం, మహిళా సాధికారితపై సదస్సు.
- 20న ఉదయం వుయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా సామూహిక స్వీయ పుస్తక పఠనం, అనంతరం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న వెంకటరావు, తదితరులు

నేడు వారోత్సవాలు ప్రారంభం

గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభించనున్నామని, బాలల దినోత్సవం, జాతీయ పతాకావిష్కరణ నిర్వహించనున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకటరావు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ కొండా రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, వయోజన విద్యాశాఖ సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయం ఇన్‌చార్జి, ఉప గ్రంథాలయ అధికారి పి.వి. నూకరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.

16న మైనార్టీ కమిషన్ రాక

మహారాణిపేట: రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్, వైస్ చైర్మన్ ఆదిపి జాషువా డేనియల్, సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, షేక్ సైపుల్లా, జితేందర్ సింగ్ ఈ నెల 16న విశాఖ రానున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనుల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషన్ చైర్మన్ ఇక్బాల్ ఒక ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

ఘనంగా నరకాసుర వధ



నరకాసుర వధను తిలకిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయం శ్రీవినాయక గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం దీపావళిని పురస్కరించుకుని నరకాసురవధ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు నరకాసురుడి బొమ్మకు నిప్పంటించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ధ బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, సభ్యులు బుద్ధ శ్రీనివాసరావు, కొణతాల కృష్ణ, బుద్ధ శివ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల సంతలో తగ్గిన గిరాకీ



తాళ్లపాలెం సంతలో గొర్రెలు, మేకల అమ్మకాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకలు అమ్మకానికి తక్కువగా వచ్చాయి. కార్తీక మాసం రాకతో వీటికి గిరాకీ తగ్గింది. కొంత మంది వ్యాపారులు, పెంపకందారులు ఆశించిన ధర లభించక గొర్రెలు, మేకల్ని తిరిగి తమ ప్రాంతానికి తీసుకెళ్లారు. కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో దొండకాయ రూ.20, బంగాళాదుంప కిలో రూ.30, వంకాయ, బెండకాయ, టమాటా రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి అమ్మకాలు సాగాయి.

బొజ్జన్నకొండపై తాగునీటి సౌకర్యం పునరుద్ధరించాలి

అనకాపల్లిటౌన్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బొజ్జన్నకొండకు పిక్నిక్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కొండవద్ద రెండు మాసాల క్రితం తాగునీటి మోటార్ పాడైపోవడంతో కొండకు వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పర్యాటకశాఖ అధికారులు తక్షణమే స్పందించి, తాగునీటి సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 5,236 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,270
మొదటి రకం	3,560	4,160
రెండో రకం	3,420	3,970
మూడోరకం	3,000	3,550

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
జపాన్	: సత్యనారాయణస్క్రీన్-1
ద మార్వెల్స్(తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 13 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కార్తీకం.. పరమం పవిత్రం



సాంబశివుని ఆలయం

న కార్తీక సమో మాసో
న కృతేన సమం యుగమ్
న వేదసదృశం శాస్త్రం
న తీర్థం గంగయా సమమ్..

కార్తీక మాసానికి సమానమైన మాసం, కృత యుగానికి సాటిరాగల యుగం, వేదాల కంటే గొప్పదైన శాస్త్రం, గంగానదికి మించిన నది లేదని స్కంద పురాణ ప్రతీతి. తెలుగు మాసాల్లో ఎనిమిదవది కార్తీకమాసం. చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలిసిన రోజు కార్తీకం. కార్తీక మాసం సదాశివుడు, మహావిష్ణువు పూజలకు పరమం పవిత్రం. అందుకే ఊరూవాడా శివకేశవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. నెలంతా ఆధ్యాత్మిక శోభతో అలరారనున్నాయి.



విద్యుద్దీపాలంకరణలో సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి ఆలయం

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- ఊరూవాడా ముస్తాబైన శివ, కేశవ క్షేత్రాలు

అనకాపల్లిటౌన్/తుమ్మపాల: శివాలయాలకు కార్తీకశోభ సంతరించుకుంది. మంగళవారం నుంచి వచ్చే నెల 13 వరకు కార్తీక మాసోత్సవాలకు శైవ, వైష్ణవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే ఆలయాలకు సున్నాలు, రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఈ మాసం హరిహరాదులకు ప్రీతికరం కావడంతో ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. గవరపాలెం భోగలింగేశ్వరుని ఆలయం,కూరగాయల మార్కెట్ సాధువుల ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, సిద్ధి లింగేశ్వరస్వామి ఆలయం, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర ఆలయం, చేపలబజారు వద్దనున్న సాంబశివుని ఆలయం, సుంకరమెట్ట సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి ఆలయాలు విద్యుత్ దీపాలంకరణతో ధగధగలాడుతున్నాయి. ఆలయాలకు భారీ సంఖ్యలో భక్తుల రానున్న నేపథ్యంలో ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు క్యూలైన్లతోపాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేశారు. నెలరోజులపాటు రోజూ ఉదయం స్వామి వారికి పలు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభాల ఆకాశ దీపం వెలిగించేందుకు అర్చకులు ఏర్పాట్లు చేశారు.

శారదాఘాట్ వద్ద పటిష్ట ఏర్పాట్లు

పట్టణంలో అతిపెద్ద శారదాఘాట్ వద్ద మహిళాభక్తులు తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇప్పటికే జీవీఎంసీ అధికారులు ఘాట్ వద్ద ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. నదిలో ఉన్న వ్యర్థాలను శుభ్రం చేశారు. మహిళా భక్తులు స్నానమాచరించి, అక్కడే ఉన్న ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకుని బ్రాహ్మణులకు స్వయంపాకం, దీప దానాలు ఇస్తారు. మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు సైడ్‌వాల్స్, టెంట్లు తదితర ఏర్పాట్లకు ఆలయ కమిటీ సభ్యులు పూర్తిచేశారు.



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్ ఏర్పాట్లు

భోగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని గవరపాలెం భోగలింగేశ్వరస్వామి వారికి నెలరోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం 5.30 ఆకాశదీపం ప్రారంభం. 20న ప్రాకారసేవ, ఊంజల్‌సేవ, 30న మహన్యాసపూర్వక రుద్రాభిషేకం. డిసెంబర్ 4న అర్ధ ఏకాహం. 11న లక్షపత్రిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



ఆకాశదీపం కోసం సిద్ధం చేసిన దీపాల బుట్టలు

కశింకోట: కార్తీక మాసం పూజలకు శైవ, వైష్ణవ ఆలయాలు సిద్ధమయ్యాయి. శారదానదికి భక్తుల కళకళ మొదలవనుంది. ప్రధానంగా కార్తీకమాసం పురస్కరించుకుని గవరపేట, డీపీఎన్ హైస్కూల్, పొట్టి శ్రీరాములు పార్కు వద్దనున్న ఆలయాల్లో నెలకొల్పిన గౌరీపరమేశ్వరుల విగ్రహాలను దర్శించి రోజూ పూజలు నిర్వహించనున్నారు. శివాలయం, వేంకటేశ్వరస్వామి, సాంబమూర్తి తదితర ఆలయాలను దర్శించుకోనున్నారు. ఇక బయ్యవరం, పేరంటాలపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, బంగారయ్యపేట, సోమవరంకన్నూరుపాలెం, చింతలపాలెం, నూతలగుంటపాలెం తదితర గ్రామాల్లోని శివాలయాలు, ఏఎస్ పేటలోని సాంబశివుని ఆలయం, వెదురుపర్తిలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీకమాస పూజలకు సన్నాహాలు చేశారు.

– స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో సోమవారం రాత్రి కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంప్రదాయంగా పూజలు నిర్వహించి ఆకాశ దీపాలను వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కశింకోటలోని డీపీఎన్ హైస్కూల్ వద్ద గౌరీపరమేశ్వరుల విగ్రహం



కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో వెలిగించిన ఆకాశ దీపాలు



సిద్ధి లింగేశ్వరస్వామి ఆలయం

నేడు 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే'..

అనకాపల్లిటౌన్: పట్టణంలోని సచివాలయం-8 కోట్నివీధి, మండలంలోని గొలగాం గ్రామంలలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు అందించిన ప్రయోజనాలను ప్రదర్శించడం, గృహసారథులు, గ్రామవలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి వారికి తమ ప్రభుత్వంలో కలిగిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించడం, గ్రామం/వార్డు పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి డిస్‌ప్లే బోర్డ్ ఏర్పాటు, వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ, పట్టణ, గ్రామ పెద్దలతో డిన్నర్, రాత్రి బస వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు సచివాలయాల పరిధిలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కశింకోట: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు పల్లెకు పోదాం(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ, వాటి వివరాలతో డిస్‌ప్లే బోర్డుల ఆవిష్కరణ చేయనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కశింకోట-2, 3, 4 సచివాలయాలు, బయ్యవరం, తేగాడ, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, తాళ్లపాలెం-1 సచివాలయాల్లో రోజుకో చోట ఈ కార్యక్రమం జరపనున్నట్లు పేర్కొన్నారు. తొలి రోజు కశింకోట-2 సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభంకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా ప్రాంతాల్లో హాజరవుతారన్నారు.

త్వరలో నూకాంబిక ఉత్సవ మండపం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ పాలకవర్గ సభ్యులు

అనకాపల్లిటౌన్: నూకాంబిక అమ్మవారి ఉత్సవ మండపాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా త్వరలో ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. ఆలయ ఆవరణలో ఈవో బండా ప్రసాద్ అధ్యక్షతన సోమవారం దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అమ్మవారి ఆలయ దాతలకు ఉచిత వసతి, ప్రత్యేక దర్శనం కల్పించాలని, భక్తుల టాయిలెట్లను ఆధునికీకరించాలని సభ్యులు తీర్మానించారు. ఆలయ నైరుతి మూల రహదారి పక్కన ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఊరేగింపు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి నిలుపు మహోత్సవం ఘనంగా జరిగింది. దీపావళి ముందురోజు అమ్మవారి ప్రతిరూపంగా వరి దుబ్బును తెచ్చి, అమ్మవారి ఆలయంలో నిలుపుదల చేశాక, అమ్మవారిని పట్టణ, గవరపాలెం పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం అమ్మవారిని ఆలయంలో నిలుపుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మీనాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, ప్రసాద్, దాడి కృష్ణ, పి.వి.సత్యనారాయణ, సూరిశెట్టి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరాజు కోరారు. క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నెహ్రూచౌక్ నుంచి పెరుగుబజార్ జంక్షన్, రింగ్‌రోడ్డు, రైల్వే స్టేషన్ రహదారి, రామచంద్ర థియేటర్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించాలంటే ప్రతి గృహం వద్ద మొక్కలను నాటి, వాటి పర్యవేక్షణ చూడాలన్నారు. భావి తరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శరగడం జయలక్ష్మి, వంకాయల ఈశ్వరరావు, ఎస్.నూకరాజు, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

దేదీప్యమానంగా దీపావళి



చెరకుగడలతో దివ్వెకొడుతున్న దృశ్యం



కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం

అనకాపల్లిటౌన్: చిన్నారుల కేరింతలు ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండగను పట్టణవాసులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్నానమాచరించి నూతనవస్త్రాలు ధరించి గృహాల్లో పూజలు చేసుకున్నారు. మధ్యాహ్నం కుటుంబసమేతంగా పిండివంటలతో భోజనాలు చేశారు. సాయంత్రం ఇంటి ముంగిట, ద్వారాలకు ఇరువైపులా, వీలున్న చోటల్లా నూనె దీపాలు వెలిగించి లక్ష్మీపూజ చేశారు. ప్రసాదాలు స్వీకరించి, కుటుంబ సమేతంగా చెరకుగడలతో దివ్వెలు వెలిగించారు. దివ్వీ దివ్వీ దీపావళి.. అంటూ పాటపాడతూ సందడి చేశారు. అనంతరం చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా బాణసంచా వెలిగించారు. చిచ్చుబుడ్లు, మతాబులు, తారాజువ్వలు, ఆకాశదీపాలు ఇలా ఒకటేంటి.. రకరకాల బాణసంచాతో వీధులన్నీ ధూంధాం అంటూ మోత మోగాయి.

కశింకోట: మండల ప్రజలు దీపావళి పండగను ఆది, సోమవారాలు భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. ఈ సందర్భంగా తమ ఇళ్లలో సంప్రదాయంగా మహాలక్ష్మి పూజలు నిర్వహించి చెరకు, గోగు, ఆముదం కర్రలకు దీపాలు వెలిగించి ముక్కోటి దేవతలు దీవించాలని వేడుకుంటూ దివ్వెలు కొట్టారు. ఇళ్ల ముందు, ఇళ్లపైన వరుసగా దీపాలు వెలిగించారు. పిల్లలు మొదలుకుని పెద్దల వరకు ఎంతో ఉత్సాహంగా బాణసంచా కాల్చి ఆనందించారు. స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం తదితర చోట్ల ప్రమిదల్లో దీపాలు వెలిగించి పూజలు చేశారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాండ్రేగుల సూర్యారావు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీనగ్రామం కొత్తూరు నర్సింగరావుపేట రామాలయంలో శ్రీరామ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్, సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో పిడుగు విజయలక్ష్మి ఆర్థిక సాయంతో నిరుపేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కాండ్రేగుల సూర్యారావు మాట్లాడుతూ ఏటా దీపావళి సందర్భంగా పేదలకు తోచిన సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం కన్వీనర్ చూచుకొండ రమణ, సభ్యులు కళిరెడ్డి సుశీల, బల్లిని నాగమణి, కావలి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెడ్డీగ్యాంగ్‌పై పోలీసుల హెచ్చరిక

అనకాపల్లిటౌన్: మండలంలో చెడ్డీ గ్యాంగ్ పేరుతో ఒక ముఠా నేరాలకు పాల్పడుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కొద్ది రోజుల క్రితం తిరుపతిలో చెడ్డీ గ్యాంగ్ కదలికలు సీసీ ఫుటేజ్‌లో కనిపించిందన్నారు. జిల్లాలో కూడా ఈ ముఠా నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

ప్రధానంగా రాత్రి సమయంలో గృహాలకు తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతారని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తుల్ని గుర్తిస్తే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

సీపీఎం బైక్ ర్యాలీ



జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న లోకనాథం

అనకాపల్లి రూరల్: ఈ నెల 15న విజయవాడలో జరగనున్న సీపీఎం రాష్ట్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం పట్టణంలో సీపీఎం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ర్యాలీని సీపీఎం జిల్లా కార్యదర్శి కాళ్ల లోకనాథం జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని నెహ్రూచౌక్, రామచంద్ర థియేటర్, పార్క్ సెంటర్, అగ్గిమర్రి చెట్టు, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ కొనసాగింది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలో జరిగే బహిరంగసభ విజయవంతానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, సీహెచ్ శివాజీ, జి.నాయినబాబు, బి.ఉమామహేశ్వరరావు, కె.ఎల్లయ్యబాబు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక పుట్టుక మహోత్సవం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలోని నూకాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. బైపాస్ రోడ్డు దరి ఆలయం ప్రాంగణంలో ఈ వేడుకలను నిర్వహించారు. గత 17 ఏళ్లుగా వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆలయ చైర్మన్ మళ్ల రామజోగినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ పెంటకోట సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పెద్దలు పెంటకోట వెంకట్, సూరిశెట్టి కన్నారావు, పెంటకోట ఆదినారాయణ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లిటౌన్: వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ సింహాచలం అందించిన వివరాలు. స్థానిక శ్రీరాంనగర్‌కు చెందిన వివాహిత ఈ నెల 11న ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే సీపీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలంటూ అచ్యుతాపురంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరరావు బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

వెన్నలపాలెంలో 'జగనన్నకు చెబుదాం' రేపు

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలోని సింహాద్రి కల్యాణ మండపంలో ఈ నెల 15న (బుధవారం) ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని తహసీల్దారు పి.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మండలంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కనకారావు కోరారు.

నేడు ఉపమాకకు స్వామి రథయాత్ర



స్వామివారి రథం

నక్కపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన రథయాత్ర మంగళవారం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, విజన్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గత సెప్టెంబరు 25న తిరుపతిలో ప్రారంభమైన ఈ యాత్ర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 250 వేంకటేశ్వర స్వామి ఆలయాలను సందర్శిస్తూ చివరకు తిరుపతి చేరుకుంటుందన్నారు. ఈయాత్రలో భాగంగా మంగళవారం ఉపమాక రానున్న యాత్రకు స్వాగతం పలకడంతో పాటు, రథంలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలిరావాలని కోరారు. రథంలో ఉన్న మూర్తులకు పూజలు నిర్వహించిన తర్వాత ఈ రథం ఎస్.రాయవరంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి, అక్కడ నుంచి అనకాపల్లి వెళ్తుందన్నారు.

రాజరాజేశ్వరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆది, సోమవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమశాలలో శ్రీమహా గణపతి, మహా మృత్యుంజయ సహిత మహాలక్ష్మి చేశారు. పంచామృతాభిషేకం,నూతన వస్త్ర, ఆభరణ అలంకరణ జరిగాయి. గురుమాత అన్నపూర్ణమ్మ దీపావళి విశిష్టతపై భక్తులకు సందేశమిచ్చారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.